క్లుప్తంగా

పాఠశాలకు వితరణ



వత్సవాయి : మండల కేంద్రం వత్సవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి గుత్తా కృష్ణమూర్తి పాఠశాల విద్యార్థులకు, పాఠశాలకు కలిపి 1,50,000 విలువచేసే వస్తువులను శనివారం వితరణగా అందజేశారు. తన తల్లిదండ్రులు గుత్తా నారాయణ, అన్నపూర్ణమ్మ, భార్య సుశీల జ్ఞాపకార్థం విద్యార్థులకు డైరీలు, కాపీ పుస్తకాలు, ఎక్కాల పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, కుర్చీలు, మధ్యాహ్న భోజన పథకం ప్లేట్లుతో పాటు తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన ఐదుగురు విద్యార్థులకు నగదు పారితోషకాన్ని అందజేసి అభినందించారు. ప్రత్యేకావసరాలు కలిగిన విద్యార్థులకు నగదు సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఆర్.అశోక్‌కుమార్ దాత గుత్తా కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుత్తా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కాకాని శ్రీనివాసరావు, పీడీ మార్క్ పూడి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీర్ల బాధ్యతల స్వీకరణ



ఎండీ కలీముల్లా



షేక్ ఇస్సార్‌అహ్మద్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘం డీఈఈగా ఎండీ కలీముల్లా, ఏఈగా షేక్ ఇస్సార్‌అహ్మద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఈఈ శివకోటేశ్వరరావు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు, ఏఈ హనుమంతరావు తిరువూరు మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ఆస్థానాల్లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బదిలీపై వచ్చి కలీముల్లా, ఇస్సార్‌అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు.

వెండి వస్తువులు బహూకరణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారికి శనివారం తెలంగాణ రాష్ట్రం, కోదాడ పట్టణానికి చెందిన యాళ్ల చెంచురామయ్య, భద్రమ్మ దంపతులు మిశ్రమ వెండితో తయారుచేసిన 530 గ్రాముల వెండి ప్లేట్, 2గిన్నెలను శనివారం ఆలయ అధికారుల చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో పీఏ సీఎస్ సీఈఓ కొండలుశర్మ పాల్గొన్నారు.

బోనస్ పంపిణీ



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని ముండ్లపాడు పాల ఉత్పత్తిదారులకు శనివారం బోనస్ పంపిణీ చేశారు. స్థానిక పాలకేంద్రంలో మొత్తం 160మంది పాల ఉత్పత్తిదారులకు బోనస్ కింద రూ.99,246 పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, పాల కేంద్రం అధ్యక్షులు కొత్తపల్లి రామనాథం, కార్యదర్శి సుదర్శన్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

టమాటాపై రాయితీ ఏది?

ప్రశ్నించిన ఇంటూరి చిన్నా

జగ్గయ్యపేట అర్బన్: నందిగామ రైతుబజారులో కిలో టమాటా కొనుగోలుపై రూ.5 రాయితీ ఇస్తుండగా, అదే ప్రభుత్వ నిబంధన జగ్గయ్యపేట రైతుబజారులో ఎందుకు అమలు కావడంలేదనివైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా) శనివారం ఒక ప్రకటనలో అధికారులను ప్రశ్నించారు. రాయితీపై టమాటా కేజీ రూ.30 విక్రయించాల్సి ఉండగా, జగ్గయ్యపేటలో రూ.46అమ్ముతున్నారన్నారు. రాయితీ ఇవ్వకపోగా రూ.11రూపాయలు అదనంగా అమ్ముతున్నారని విమర్శించారు. రాయితీతోపాటు అదనంగా రూ.10 అధికంగా అమ్ముతుండటంతో ప్రజలపై కేజీ టమాటాకి రూ.15 అదనపు భారం పడుతోందన్నారు. ఈ డబ్బులన్నీ ఎవరి జేబులోకి వెళ్తున్నాయో పాలకులు చెప్పాలని ఇంటూరి రాజగోపాల్ తన ప్రకటనలో డిమాండ్ చేశారు.

సదస్సుకు హాజరుకండి



వీరులపాడు: వ్యవసాయ రంగ సమస్యలపై ఈనెల 21, 22వ తేదీల్లో ఏపీ రాష్ట్ర రైతులు, కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో చేపట్టిన సదస్సులను విజయవంతం చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు కోరారు. ఈ మేరకు శనివారం రైతుసంఘం ఆధ్వర్యంలో వీరులపాడులో ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చాట్ల రవి, కోదూరు పిచ్చేశ్వరరావు, వట్టికొండ పార్థసారథి, సత్యం, భగీరథ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు దక్కని సాయం



వరదలకు కొట్టుకుపోగా దుకాణంలో మిగిలిన సరుకు (ఫైల్)



పెనుగంచిప్రోలు: గతనెల మొదటివారంలో సంభవించిన వరదలు పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ ఆలయం వద్ద వ్యాపారాలు చేసుకునే చిరువ్యాపారులకు తీరనినష్టాన్ని మిగిల్చాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా వరదలు ఆలయం చుట్టు ముట్టడంతో పలు దుకాణాలు వరదలో కొట్టుకుపోగా, కొన్ని దుకాణాల్లోని సామగ్రి నీటిపాలైంది. ఆలయం వద్ద బొమ్మలు, ఫ్యాన్సీ సరుకు, కీచైన్లు విక్రయించే తదితర 40దుకాణాలు ఈ వరదలకు దెబ్బతిన్నాయి. వరద ఉధృతికి ఒక్కో దుకాణానికి రూ.1లక్ష నుంచి రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లింది.

చిరువ్యాపారులకు దెబ్బమీద దెబ్బ...

వరదలకు దుకాణదారులు నష్టపోయి యాభై రోజు లు అవుతున్నా.. ఇటు ప్రభుత్వం నుంచి గానీ, అటు దేవాలయ అధికారుల నుంచి గానీ నేటి వరకు ఎటువంటి సాయం అందలేదు. దీంతో చిరువ్యాపారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతంలో దుకాణాలు కాలిపోవడంతో ఆలయ క్యాంటీన్ పక్కన తమకు దుకాణాలు కేటాయించగా, ఇంతలోనే వరదలు సంభవించి దుకాణాలు పూర్తిగా కొట్టుకుపోయాయని చిరువ్యాపారులు వాపోతున్నారు.

గతంలో హక్కుల పొడిగింపు..

గతంలో రెండుసార్లు అగ్నిప్రమాదం కారణంగా నష్టపోయిన దుకాణదారులకు ఒక్కొక్కరికి రూ.10వేలు పరిహారం అందించారన్నారు. కరోనా సమయంలో, ఈ ఏడాది జనవరిలో అగ్ని ప్రమాదంతో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు ఏడాదిపాటు వేలం హక్కులను పొడిగించారని ఈవోకు గుర్తుచేశారు. వరదలకు నష్టపోయిన తమకు కనీసం ఆరునెలలపాటు వేలం గడువు పొడిగించి తమను ఆదుకోవాలని ఈవోను కోరారు.

ఆలయ ఈవోకు వినతి...

గతనెలలో వచ్చిన భారీ వరదలకు వ్యాపారాలు బాగా దెబ్బతిన్నాయని దుకాణదారులు చెబుతున్నారు. దుకాణాలకు రహదారి సౌకర్యం లేక భక్తుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గడంతో అన్నిరకాల వ్యాపారాలు దారుణంగా దెబ్బతిన్నాయంటూ చిరువ్యాపారులు ఆలయ ఈవో బీహెచ్‌వీఎన్ కిషోర్‌కుమార్‌ను శుక్రవారం రాత్రి తమగోడు వినిపించారు. వరదల కారణంగా నష్టపోయినందున ఆదుకోవాలంటూ ఈవోకు వినతిపత్రం అందజేశారు. ఆలయం వద్ద వ్యాపారాలు చేసుకునేందుకు వేలం గడువు హక్కును మరో ఆరునెలలు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.



ఆలయ ఈవోకు వినతిపత్రం ఇస్తున్న చిరువ్యాపారులు

వరదలతో నష్టపోయాం..



మునేరు వరదకు దుకాణంలో ఉన్న ఫ్యాన్సీ సరుకంతా నీటిలో కొట్టుకుపోయింది. అలాగే దుకాణం రేకులు కూడా కొట్టుకుపోయాయి. వరద ప్రవాహానికి దుకాణం దగ్గరకు పోలేక పోయాం. వరదల కారణంగా ఆర్థికంగా నష్టపోయాం.

– గుర్రాల వెంకటేశ్వరరావు

సరుకంతా కొట్టుకుపోయింది..



వరదకు బొమ్మలు, దుకాణంలోని ఇతర సరుకులన్నీ నీటిలో కొట్టుకు పోయాయి. దుకాణం కూడా పూర్తిగా దెబ్బతింది. దారుణంగా నష్టపోయిన తమను ఆదుకోవాలి. ఆలయ అధికారులు, పాలకవర్గం మాపై కనికరం చూపాలి.

– యడ్ల లీలమ్మ

రెండునెలలుగా బేరాలు లేవు...



వర్షాలతోపాటు సరైన రోడ్డు మార్గం లేక రెండునెలలుగా భక్తులు దుకాణాల వద్దకు రావడం లేదు. దీంతో వ్యాపారాలు బాగా తగ్గాయి. వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయాం. గతంలో మాదిరి ఆదుకోవాలి.

– దారా రాజు

వేలం గడువు పెంచాలి..



వరదలకు కొంతసరుకు కొట్టుకుపోగా, మిగిలిన సరుకు దొంగలపాలైంది. వరదలకు నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలి. వేలం హక్కుల గడువు పెంచటంతోపాటు, తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు, లైట్లు ఏర్పాటు చేయాలి.

– చేని కుమారి

పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి

శనగపాడు(పెనుగంచిప్రోలు): పిడుగుపాటుకు పశువుల కాపరి మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ధారావతు బాలాజీ(50) పశువులు మేపేందుకు గ్రామశివారులోని పొలానికి వెళ్లాడు. అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కారణంగా సమీపంలో పిడుగుపడి బాలాజీ అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

జగ్గయ్యపేట అర్బన్: తాజ్కియ బైతుల్ మాల్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి పేట నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఇషాక్, షేక్ ఫయాజ్ శనివారం తెలిపారు. స్థానిక రంగుబజారులోని సైదా సాహెబ్ మాస్టర్ ఇంటివద్ద ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించే వైద్యశిబిరాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పౌష్టికాహార ప్రయోజనాలపై అవగాహన

నందిగామటౌన్: మునగ, కరివేపాకును రోజువారీ ఆహారంలో తీసుకోడం ద్వారా శరీరానికి ఎన్నో ప్రయోజనాలున్నాయని అంగనవాడీ కార్యకర్తలు సూచించారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలపై శనివారం గర్భిణీలు, బాలింతలకు అవగాహన కలిగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలన్నారు. మునగ, కరివేపాకుతో ఎన్నో లాభాలున్నాయని ఆహారంలో ప్రతిఒక్కరూ విధిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు సావిత్రి, వెంకట్రావమ్మ, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పేదల నోటికాడ కూడు లాక్కోవడం తగదు



కంచికచర్లలో నిరసన ప్రదర్శన చేస్తున్న బాధిత డప్పుకళాకారులు, చర్మకారులు, జెడ్పీటీసీ



సీనియర్‌అసిస్టెంట్ దుర్గామల్లేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న డప్పుకళాకారులు, చర్మకారులు

జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి

కంచికచర్ల: సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం డప్పుకళాకారులు, చర్మకారుల పింఛన్ తొలగింపు పేరుతో పేద ప్రజల నోటికాడ ఉన్న కూడును లాక్కునేందుకు యత్నించడం తగదని జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి అన్నారు. తమ పింఛన్లు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం నోటీసులు జారీచేసిందంటూ మండలంలోని చర్మకారులు, డప్పు కళాకారులు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంతోపాటు చెవిటికల్లు సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. డప్పు లు మోగించి ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తంచేశారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ దుర్గామల్లేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వేల్పుల ప్రశాంతి మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గంలో 2,100 మంది డప్పుకళాకారులు, చర్మకారులకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పింఛన్లు మంజూరు చేయించి వారికి అండగా నిలిచారన్నారు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో తూతూ మంత్రంగా సామాజిక తనిఖీలు నిర్వహించి 692మంది పింఛన్లు తొలగించేందుకు నోటీసులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పింఛన్లు తొలగించకుండా లబ్ధిదారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పింఛన్లను తొలగిస్తే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నిరసన ప్రదర్శనలో కొత్తపేట, గండేపల్లి సర్పంచులు ప్రత్తిపాటి కృష్ణమూర్తి, బొక్కా రవి కుమార్, వేములపల్లి ఎంపీటీసీ నల్లపు శ్రీనివాసరావు, నాయకులు వేల్పుల రమేష్, రాయల నరసింహారావు ముప్పాళ్ల శివాజీ, ముప్పాళ్ల రాజు, వేమవరపు పురుషోత్తం, మాడుగుల ఆంజనేయులు, బాధిత డప్పుకళాకారులు, చర్మకారులు పాల్గొన్నారు.

క్వారీ యజమానులు నిబంధనలు పాటించడం లేదు

ఆర్డీఓకు తెలిపిన పరిటాల వాసులు



మాట్లాడుతున్న నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ



ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన గ్రామస్తులు, అధికారులు

కంచికచర్ల : మండలంలోని పరిటాల గ్రామ సచివాలయంలో కాలుష్య నియంత్రణ మండలి విజయవాడ ప్రాంతీయ కార్యాలయ అధికారి ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. పరిటాల సమీపంలో దొనబండలో కొనసాగుతున్న బి.త్రివిక్రమ్ రాతి క్వారీ నిర్వాహకులు 2.361 హెక్టార్ల విస్తీర్ణంలో రోడ్డు మెటల్, బండరాళ్ల మైనింగ్ కోసం దరఖాస్తుకోగా, అజాద్ క్వారీ కూడా పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంది. ఈ రెండు దరఖాస్తులపై నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ కలిసి పరిటాల గ్రామస్తుల నుంచి అబిభిప్రాయాలు సేకరించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన మాగంటి వెంకటరమణ(అబ్బాయి) మాట్లాడుతూ క్వారీ యజమానులు నిబంధనలు పాటించకపోతుండటంతో గ్రామస్తులం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆర్డీవో, ఈఈ శ్రీనివాస్ దృష్టికి తెచ్చారు. రాతిక్వారీల్లో చేపట్టే బ్లాస్టింగ్‌లతో ఇళ్ల బీటలు వారుతుండగా, రోడ్డు సైతం దెబ్బతింటున్నాయని వివరించారు. గ్రామస్తులకు క్వారీ యజమానుల నుంచి ఎటువంటి సహాయసహకారాలు అందడం లేదని పేర్కొన్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారంటూ పలువురు గ్రామస్తులు విమర్శించారు. అనంతరం ఆర్డీఓ కె.బాలకృష్ణ మాట్లాడుతూ ఈ సమావేశం కేవలం ప్రజాభిప్రాయం కోసం మాత్రమేనని తెలిపారు. సమావేశం సందర్భంగా తమ దృష్టికి వచ్చిన విషయాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.జాహ్నవి, రెవెన్యూ, పంచాయతీ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిహారం అందజేయాలని వినతి



రెవెన్యూ ఉద్యోగికి వినతిపత్రం అందజేస్తున్న వరద బాధితులు, జెడ్పీటీసీ ప్రశాంతి, నాయకులు

కంచికచర్ల: గతనెలలో కురిసిన భారీవర్షాలు, సంభవించిన వరదలకు నష్టపోయిన ఏటిపట్టు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి వారిని ఆదుకోవాలని కంచికచర్ల జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి డిమాండ్ చేశారు. గతనెలలో సంభవించిన వరదలకు నష్టపోయిన తమకు పరిహారం ఇవ్వాలని కోరుతూ ఏటిపట్టు గ్రామాలకు చెందిన పలువురు బాధితులు, జెడ్పీటీసీతో కలిసి శనివారం కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి ఓ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి మాట్లాడుతూ వరద బాధితులకు నష్టం అందించే విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం తగదన్నారు. ఈ తొమ్మిది గ్రామాల్లో 5487 ఇళ్ల ముంపునకు గురైనట్లు రీఎన్యుమరేషన్‌లో అధికారులు గుర్తించినందున, బాధితులందరికీ పరిహారం అందజేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులతో కలిసి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వేములపల్లి ఎంపీటీసీసభ్యుడు నల్లపు శ్రీనివాసరావు, నాయకులు ప్రత్తిపాటి కృష్ణమూర్తి, రాయల నరసింహారావు, వేల్పుల రమేష్, వేమవరపు పురుషోత్తం, బీ రవికుమార్, ముప్పాళ్ల సత్యనారాయణ, ముప్పాళ్ల అప్పారావు, ముప్పాళ్ల శివాజీ, ముప్పాళ్ల రాజు, ఆయా గ్రామాల వరద బాధితులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: ఏపీ సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీపై ఉచిత శిక్షణ ఉచితంగా ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందాలనుకున్న అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోగా తమ దరఖాస్తులను జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 27వ తేదీన దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి మెరిట్ అభ్యర్థులను అర్హత ప్రకారం ఉచిత శిక్షణకు ఎంపిక చేస్తామని వివరించారు.

పనులను పర్యవేక్షించాలి

వీరులపాడు: ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దాపురం, జయంతి, చౌటపల్లి గ్రామాల్లో రూ.కోటి వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఆర్థికసాయం అందజేత : తన్నీరు

జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల జగ్గయ్యపేటలో టీడీపీ నాయకుల వేధింపులు, దౌర్జన్యాలకు కారణంగా ఆత్మహత్య చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త గుగ్గిళ్ల శ్రీను కుటుంబానికి అండగా ఉంటామని ఆపార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు శనివారం తెలిపారు. బాధిత కుటుంబానికి ఆదుకునేందుకు పార్టీ అధినేత, మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.2 లక్షలను ఆర్థికసాయంగా ప్రకటించారని వివరించారు. ఈమేరకు ఆదివారం ఉదయం పదిన్నర గంటలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ చేతుల మీదుగా శ్రీను కుటుంబసభ్యులకు అందజేస్తామన్నారు. ఆర్థిక సాయం ప్రకటించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

జనసేనలో చేరిన కౌన్సిలర్లు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సమక్షంలో జగ్గయ్యపేటకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్లు జనసేన పార్టీలోకి చేరారు. మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో పార్టీలోకి చేరిన మున్సిపల్ కౌన్సిలర్లకు పార్టీ కండువాలు కప్పి పవన్ కళ్యాణ్ వారిని పార్టీలోకి ఆహ్వానించినట్లు జగ్గయ్యపేట పార్టీ కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. జనసేనలో చేరిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్‌తోపాటు 10మంది కౌన్సిలర్లు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉన్నారని వివరించారు.

కెమికల్ ఫ్యాక్టరీల తనిఖీ

జగ్గయ్యపేట: పట్టణ సమీపంలోని ఆటోనగర్ ఇండస్ట్రియల్ పార్కులోని కెమికల్ ఫ్యాక్టరీలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోనగర్‌లోని కొన్ని కర్మాగారాల నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తుండటంతో పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారం రోజులుగా విపరీతంగా దుర్వాసన వెదజల్లుతున్నా యాజమాన్యాలు పట్టించుకోవడంలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీపంలోని వెయ్యి మంది విద్యార్థులతో కూడిన పాఠశాల ఉందని దుర్వాసన వెలువడితే విద్యార్థులు ప్రమాదాల బారిన పడతారన్నారు. ఇప్పటికైనా కాలుష్య నిబంధనలు పాటించాలని లేకుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఉన్నారు.

పప్పుధాన్యాల సాగుపై సమీక్ష



కేవీకేలో సాగవుతున్న కంది పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగమణెమ్మ

గరికపాడు(జగ్గయ్యపేట): రైతులను పప్పుధాన్యాల సాగు చేపట్టేలా వారికి వ్యవసాయాధికారులు అవగాహన కలిగించాలని జిల్లా వ్యవసాయాధికారి నాగమణెమ్మ సూచించారు. మండలంలోని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో శనివారం జిల్లాలోని వ్యవసాయాధికారులతో పప్పుధాన్యాల సాగుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పప్పుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోందన్నారు. అందుకనుగుణంగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో ఫెర్టిలైజర్స్ దుకాణదారులు ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ మిర్చి నారు విషయంలో అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. వ్యవసాయాధికారులు నర్సరీలను తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం కేవీకేలోని వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. సమావేశంలో కేవీకె కోఆర్డినేటర్ అచ్యుత్‌రాజు, ప్రధానశాస్త్రవేత్త కృష్ణంరాజు, జిల్లాలోని ఏడీఏ, ఏవోలు పాల్గొన్నారు.

మద్యం షాపు తొలగించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే సౌమ్యకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులు

కంచికచర్ల: విద్యాసంస్థలు, హైవే పక్కన ఏర్పాటు చేసిన మద్యంషాపుల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు శనివారం నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను కలిసి విజ్ఞపి చేశారు. ఈమేరకు ఎమ్మెల్యేకు ఓ వినతిపత్రం అందజేశారు.

కంచికచర్ల హైవే పక్కన సంస్కృతి విద్యామందిర్, కేవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూళ్లు ఉండగా సమీపంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారని, ఆ మద్యం షాపు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈవిషయంపై ఎక్సైజ్ సీఐ అప్రమున్నిసాబేగంకు వినతిపత్రం అందజేసినా ఫలితం లేకుండా పోయిందని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే సౌమ్య స్పందిస్తూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన వారిలో సంస్కృతి విద్యామందిర్ కరస్పాండెంట్ అనూరాధ, కేవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కేవీ కృష్ణారావు, శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రతినిధులు ఉన్నారు.

కంచికచర్లలో భారీ వర్షం



జుజ్జూరులో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

కంచికచర్ల : కంచికచర్లలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో అరగంట పాటు భారీ వర్షం కురవడంతో రోడ్లపై నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. భారీ వర్షానికి కంచికచర్ల-జుజ్జూరు రోడ్డులో వర్షపునీరు నిలబడిపోయింది. వ్యవసాయమార్కెట్ యార్డులో ఆరబెట్టిన మొక్కజొన్నలు తడిచిపోయాయి. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వర్షపునీరు నిలబడిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలో శనివారం మధ్యాహ్నం వరకు భానుడు విజృంభించినప్పటికీ సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఒకింత సేద తీరారు. వాతావరణ శాఖాధికారుల తుఫాన్ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఇటీవల కురిసిన వర్షాలు, వరదలు మిగిల్చిన నష్టం తేరుకోలేదని మరలా తుఫాన్ హెచ్చరికలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. భారీ వర్షం కురవడంతో మండలంలోని ఆయా గ్రామాలలో వరద నీరు, మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. ముఖ్యంగా మండల కేంద్రమైన జుజ్జూరులో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. రోడ్లకు ఇరుపక్కలా డ్రైన్‌లు లేకపోవడంతో వర్షపు నీటితో కలిసి మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో నడిచేందుకు వీలులేక ప్రజలు అవస్థలుపడ్డారు.

దేవదాయశాఖ ఆదేశాలు బేఖాతరు

మద్యంషాపును తెరిచిన నిర్వాహకులు



మద్యంషాపునకు శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



శనివారం మద్యం షాపును తెరిచి విక్రయాలు సాగిస్తున్న నిర్వాహకులు

నందిగామటౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన స్థలంలో మద్యం దుకాణం ప్రారంభించారని తెలుసుకున్న ఆలయ అధికారులు శుక్రవారం రాత్రి నిర్వాహకులతో మాట్లాడే క్రమంలో వాగ్వాదం చోటు చేసుకుంది. దేవదాయ శాఖాధికారులు విషయాన్ని ఆ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు మద్యం దుకాణాన్ని మూసివేయించారు. అనంతరం ఆలయానికి చెందిన స్థలం అని పేర్కొంటూ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే శనివారం ఉదయం నిర్వాహకులు మద్యం షాపును తెరిచి యథావిధిగా మద్యం విక్రయాలు సాగించడంతో స్థానికులు అవాక్కయ్యారు. ఈ వ్యవహారంపై దేవదాయశాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.